క్లుప్తంగా

నూతన విద్యా విధానంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

తిరువూరు: నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఈ ఏడాది డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు తెలిపారు. గతంలో గ్రూపు సబ్జెక్టులు మూడు ఉండగా ఇకపై ఒక మేజర్ సబ్జెక్టు, ఒక మైనర్ సబ్జెక్టు ఉంటాయన్నారు. బీఏలో హిస్టరీ మేజర్ సబ్జెక్టుగా, ఎకనామిక్స్ మైనరు సబ్జెక్టుగా, బీకాం కంప్యూటర్స్‌లో కంప్యూటర్ అప్లికేషన్స్ మేజరు, ఎకనామిక్స్ మైనర్ సబ్జెక్టుగా విద్యార్థులు ఎంచుకోవాలని తెలిపారు. అలాగే బీఎస్సీ ఎంపీఎస్ గ్రూపులో లెక్కలు మేజరు, కంప్యూటర్ సైన్స్ మైనర్, బీఎస్సీ ఏటీ జెడ్సీ గ్రూపులో జువాలజీ మేజరు, ఆక్వా కల్చర్ మైనర్ సబ్జెక్టుగా బోధిస్తామన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

మైలవరం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని పాలా నారాయణరెడ్డి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం దాతలు శివకుమార్‌రెడ్డి కుమారులు బొమ్మారెడ్డి నిహాల్‌రెడ్డి, నికేత్‌రెడ్డిల సౌజన్యంతో మజ్జిగ, నిమ్మరసం, గ్లూకోజ్ నీరు పంపిణీ చేశారు. ప్రస్తుతం రోహిణీ కార్తెలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, వాతావరణం చల్లబడే వరకు మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: ప్రజలు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, భయపడాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యాధికారి సుహాసిని అన్నారు. మైలవరం మండలం పోరాటనగర్‌లో జ్వరాల కారణంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం సాయంత్రం సందర్శించారు. జ్వరాలు సోకకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రబలకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు జ్వరాన బారిన పడినపుడు మాంసాహారానికి దూరంగా ఉండాలని సూచించారు. తాగునీటి విషయంలో తగు జాగ్రతలు తీసుకోవాలని, జ్వరాలు తీవ్రత తగ్గే వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డీఎంఓ నల్లమోతు బాబు, ఎంపీడీఓ లక్ష్మీకుమారి, వైద్యాధికారి నరేష్, సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి, ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశారు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లో నీరు కలుషితమవుతుందని గుర్తించి నీటిని సేకరించి పరీక్షలకు పంపించారు. రిపోర్టులు వచ్చే వరకు ప్లాంట్‌ను మూసివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన

- తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి
- గంపలగూడెంలో సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రారంభం



గంపలగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి, వేదికపై ప్రజాప్రతినిధులు

గంపలగూడెం: సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుపరిపాలన అందజేస్తూ ప్రజాభిమానాన్ని పొందుతుందని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. గంపలగూడెంలో రూ.46.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయం-1 భవనం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిపాలన వికేంద్రీకరణ లక్ష్యంగా సచివాలయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. గతంలో ఏ దరఖాస్తు చేయాలన్న మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల చుట్టూ అనేక మార్లు ప్రజలు కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి వలంటీర్ల ద్వారా ఇళ్ల వద్దకే సేవలు అందిస్తోందన్నారు.

రైతులకు మేలైన సేవలు..

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు గతంలో కంటే మిన్నగా మేలైన సేవలను అందజేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను ఇస్తున్నామన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఏదైనా పంటకు నష్టం వాటిల్లితే, బాధిత రైతులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా అదే సీజన్‌లో నష్ట పరిహారం అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొత్తగుండ్ల లావణ్య, పెదగవళ్ల రజని, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, కొత్తగుండ్ల నరసింహారావు, నేతలు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, కొత్తగుండ్ల వంశీ, అల్లు కృష్ణారెడ్డి, కోట దాసు, కోట కోటేశ్వరరావు, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, ఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాకర్లలో సచివాలయ భవనం ప్రారంభం

కాకర్ల(తిరువూరురూరల్): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. మండలంలోని కాకర్లలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ చేసేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. గతంలో మండల కేంద్రానికి వచ్చి పనులు చేసుకునే ప్రజలు తమ గ్రామస్థాయిలోనే అన్ని ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించుకునే వెసులుబాటు సచివాలయ వ్యవస్థతో సాధ్యమైందన్నారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ తాళ్లూరి రాధా రుక్మిణి, ఎంపీటీసీ సభ్యురాలు బేబీ దివ్య, లక్ష్మీపురం పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి నవీన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



నూజివీడు పట్టణం ఎమ్మార్ అప్పారావు కాలనీలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

నూజివీడు: నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల పరిధిలో గురువారం పింఛన్ల పంపిణీని వలంటీర్లు ముమ్మరంగా చేపట్టారు. వలంటీర్లు తెల్లవారుజామున లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపు తట్టి పింఛన్ నగదును అందజేశారు. నూజివీడు మండలంలో 88 శాతం, నూజివీడు పట్టణంలో 85 శాతం పింఛన్లను తొలి రోజైన గురువారం పంపిణీ చేశారు. మండలంలో 10,493 పింఛన్లు ఉండగా తొలి రోజు 9,065 పింఛన్లను, పట్టణంలో 5,154 పింఛన్లకు గాను 4,435 పింఛన్లను అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల లబ్ధిదారులు వేరే ఊర్లలో ఉండటంతో అక్కడకు సైతం వెళ్లి పింఛను నగదును అందజేస్తున్నారు.

82.39 శాతం పంపిణీ

మైలవరం: మైలవరం మండలంలో బుధవారం ఒక్క రోజులో 82.39 శాతం పెన్షన్‌లు పంపిణీ చేశామని ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మండలంలో 9,627 మందికి గాను 7,932 మందికి పెన్షన్‌లు పంపిణీ చేశారు. రూ.2,66,32,250 మంజూరు కాగా రూ.2,19,79,000 నగదు అందజేశామన్నారు.

72 శాతం పెన్షన్లు పంపిణీ

చాట్రాయి: మండలంలో 72 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.ఝాన్సీరాణి చెప్పారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 8,413 పెన్షన్లు ఉండగా 6,051 మందికి పెన్షన్లను ఆయా గ్రామాల వలంటీర్లు పంపిణీ చేశారన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



రెడ్డిగూడెం గ్రంథాలయంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు



నూజివీడు గ్రంథాలయంలో పఠనం చేస్తున్న విద్యార్థిని

నూజివీడు: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయాలకు విచ్చేసి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఈమని శేషయ్య అన్నారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం గురువారం నాటికి 25వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు చదవడంలో పోటీలు నిర్వహించారు. అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీలకు న్యాయనిర్ణేతగా గొల్లపల్లి హైస్కూల్ హిందీ ఉపాధ్యాయిని దాసరి దుర్గామల్లేశ్వరి వ్యవహరించారు. ఆమె విజేతలను ఎంపిక చేసి నిత్య జీవితంలో చదువు అవసరాన్ని వివరించారు. గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

మైలవరం: విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్ తెలిపారు.మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం అరేబియన్ నైట్స్ కథల పుస్తకాలు చదివించి, చెప్పించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ గురించి వివరించారు. విద్యార్థులకు జనరల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది సయ్యద్ అహ్మద్, రాజేంద్రప్రసాద్, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

25వ రోజుకు చేరిన తరగతులు

రెడ్డిగూడెం: స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని 25వ రోజు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసు సంవర్థక సహాయకులు పి.రాజారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు చరిత్రను వివరించారు. విద్యార్థులు పుస్తకాలు చదవటం, నీతి కథలు, బిట్స్ చెప్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, మ్యూజికల్ చైర్స్ ఆడించారు. పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది టి.వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు అంశాలపై అవగాహన

విస్సన్నపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లీలాకవిత విద్యార్థులకు వివరించారు. అనంతరం లెమన్‌స్పూన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి భాను, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, నాయకులు

గంపలగూడెం: అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందని ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం సచివాలయం-2 పరిధిలో గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సచివాలయం పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ, కురమ బజారు, గౌడ బజార్లలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. మాట తప్పని.. మడమ తిప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలనే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి మెరుగైన పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. దీంతో రాష్ట్ర ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. పార్టీలకతీతంగా పరిపాలన, సంక్షేమ పథకాలు మున్ముందు కొనసాగాలంటే 2024 సాధారణ ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని బలపర్చాలని కోరారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, ఎంపీటీసీ సభ్యులు కొత్తగుండ్ల లావణ్య, పెదగవళ్ల రజిని, పట్టణ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు, నేతలు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, కొత్తగుండ్ల వంశీ, కోట దాసు, అల్లు కృష్ణారెడ్డి, కోట సునీత, కో-ఆప్షన్ మెంబర్ షేక్ కరీం, పి.హరికృష్ణ, అడెపు శ్రీనివాసచారి, ఏ.జగన్‌మోహన్ రెడ్డి, బి.అచ్చియ్య, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు గంపలగూడెంలో..

గంపలగూడెం: గంపలగూడెం సచివాలయం-1 పరిధిలో శుక్రవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కె.రక్షణనిది ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

జి.కొండూరు: స్థానిక రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ మండల అరుణ చేతుల మీదుగా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. చెవుటూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతుభరోసా లబ్ధిదారుల జాబితాను సర్పంచ్ పిన్నబోయిన శ్రీదేవి గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్‌ల పరిశీలన



ఇబ్రహీంపట్నం: ఆర్‌డబ్ల్యూఎస్ ఫిల్టర్ బెడ్‌లను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గురువారం పరిశీలించారు. కొండపల్లి మున్సిపాలిటీలో ఏర్పడిన తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనల మేరకు వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. తాగునీటి సరఫరాలో తలెత్తిన సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, అడపా వెంకయ్య నాయుడు, మండే చంద్రశేఖర్‌బాబు, నాయకులు కుమ్మరి శ్రీనివాసరావు, మామిళ్లపల్లి ఆనంద్, పల్లపోతు బ్రహ్మాజీ, నాగరాజు, బాబీ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పోరాటనగర్(మైలవరం): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మండల పరిధిలోని పోరాటనగర్‌లో గురువారం చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మీకుమారి మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ ఆర్.నరేష్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీల కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. పిచ్చిమొక్కల నివారణకు మందులు పిచికారీ చేయించామన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన



స్వప్నను అభినందిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన జగనన్న ఆణిముత్యాలు పురస్కారానికి జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థినిని ఎమ్మెల్యే రక్షణనిధి గురువారం అభినందించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఆదూరి స్వప్న హెచ్ఈసీ గ్రూపులో 971 మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికయ్యారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా



తిరువూరు: పట్టణంలోని పలు వార్డుల్లో ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేపట్టారు. పాత పైపులైన్లు పగిలిపోయి, వాల్వులు లీకేజీల కారణంగా కొన్ని వార్డులకు రక్షిత నీరందక ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో మూడు ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు. వార్డు కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్లను పంపుతున్నట్లు నగర పంచాయతీ అధికారులు తెలిపారు.

ఏడు గ్రామాల్లో డ్రోన్ సర్వే ప్రారంభం



తిరువూరురూరల్: మండలంలోని ఏడు గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు సర్వే ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. గానుగపాడు, చౌటపల్లి, జీకొత్తూరు, చిక్కుళ్ళగూడెం, టేకులపల్లి, పల్లెర్లమూడి గ్రామాల్లో డ్రోన్లతో సర్వేను చేపట్టారు. ఆయా గ్రామాల్లో సర్వేకు రైతులు సహకరించాలని, సర్వే పూర్తయిన వెంటనే పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తామని తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఏ.కొండూరు: ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.ఆనందరావు, రైతు సంఘం మండల కార్యదర్శి ఏ.అమ్మిరెడ్డి కోరారు. మండలంలోని కోడూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఉపాధి హామీ కూలీలకు కేటాయించిన బడ్జెట్‌లో కోత విధించిందన్నారు. ఈ క్రమంలో ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కూలీలపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆగిరిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

నూజివీడు: ఆగిరిపల్లిలోని శోభనాచల రామకృష్ణ భజన మందిరంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చిన్నవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్యశిబిరంలో వివిధ సమస్యలపై వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి టెన్త్ సప్లమెంటరీ పరీక్షలు

నూజివీడు: మండలంలో శుక్రవారం నుంచి పదో తరగతి సప్లమెంటరీ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు డీవైఈవో ఎం.సేవియా చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ నూజివీడు డివిజన్ నుంచి 1,150 మంది విద్యార్థులు హాజరవుతుండగా, వీరికి నూజివీడు పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్, సెయింట్ ఆన్స్, సెయింట్ థామస్, లేయా జోన్స్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి ఇన్విజిలేటర్ల నియామకం ప్రక్రియను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు బెంచీలు, విద్యుత్, మంచినీటి సదుపాయాలతో పాటు మరుగుదొడ్లు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్‌లను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లడానికి అనుమతిలేదన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులను సైతం మూసి వేయాలని ఆదేశించామన్నారు. హాల్ టికెట్‌లను చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.